వరలక్ష్మికి వరుడు

రుద్రాభట్ల నరసింగరావు

తండ్రితో వరలక్ష్మి ప్రాణం విసిగిపోతోంది — భీమవరం తాలూకా ఆఫీసు దగ్గరఉన్న ఈ సత్రపుగదులమీద అద్దె వసూలుచేసే గుమాస్తాగా ఆయన నియమింపబడిన నాటినుంచీ, (భీమవరం రైలుమార్గాల కూడలి అవడంవలన ఆ సత్రవుకి ఎంతోమంది వస్తూపోతూ ఉంటారు.) ప్రతీవారితోనూ తండ్రి తన పెళ్ళిగొడవ ఎత్తక మానటంలేదు.

శివాలయంలోని నూతినుంచి చేతితో చీర కుచ్చెళ్ళుఎత్తి పట్టుకుని, చంకన నీళ్ళ బిందెతో వస్తున్న వరలక్ష్మి అరుగుమీద ఎవరో కొత్తబ్బాయితో మాట్లాడుతున్న తండ్రిని చూసి చికాకుతో కనుబొమలు ముడిచింది.

వంటయింటిలో బిందె దింపుకుంటూ, పెసరపచ్చడిలోనికని ఉల్లిపాయలని చెక్కగా తరుగుతున్న చెల్లెలితో 'నేను తరుగుతాను లేవే. నువ్వికపో!' అంది ఆమె.

తను చేస్తున్న పనినుంచి లేచిపొమ్మన్నప్పుడల్లా లీల చప్పున గ్రహించుకుని అడ్డుచెప్పక లేచిపోవడం పరిపాటి. కాని యివాళ మాత్రం ఆ పిల్ల అలాగేకూర్చుని 'బోల్తా పడ్డావక్కయ్యా! నాన్న ఆ అబ్బాయి కులం గోత్రం అడుగుతున్నా డనుకున్నావుగదూ? కాదులే. పాపం ఆయన బెజవాడ వెళ్ళాలిట. పైనుంచి వస్తూంటే ఇక్కడి రైళ్ళు అవీ అందలేదుట. అందుకనేమో యీ రాత్రి కిక్కడ ఆగుతాడట. ఓ గది యిమ్మనీ...అఁ అదండి' అని నవ్వింది.

వరలక్ష్మి కోపం నటించింది. 'పన్నెండేళ్లు లేవు గాని పెద్దకబుర్లు చెప్పడానికి తగుదువు. కొత్తవాళ్లొస్తే గడపలోకి లైటుపట్టుకు వెళ్ళక్కర్లేదుటే?' అంటూ హరికేన్ లాంతరు పట్టుకువెళ్ళి గుమ్మంమీద ఉంచి తాను సగంవరకూ తలుపుచాటున [illegible]డింది.

నారింజపండురంగు బుష్కోటు వేసుకున్న ఆ యువకుడు '...ఈ రాత్రి కిక్కడ ఆగడానికి మీరు కాస్త సదుపాయంచేస్తే తెల్లవారుఝాము బండికి వెళ్ళిపోతాను.' అన్నాడు-వరలక్ష్మివైపు ఒకచూపు విసరి.

'సరే మీరేబండికి వెడితే మాకేం లెండి. అర్ధరూపాయి చెల్లిస్తే గది యిస్తాం. కాని చాపలూ గీపలూ అంటే మాత్రం [illegible]ంవు' అన్నాడు పేరిశాస్త్రి.

'అర్ధరూపాయే? ఒక్కరాత్రికే!' అని అప్రాడు కొంచెం ఆశ్చర్యాన్ని కనబరచాడు. 'అదేమిటండీ గుమాస్తాగారూ, వెనక ఓసారి నేనీ సత్రవులో దిగినవాడినే. మూడురోజుల దాకా ఊరకనే ఉండనిస్తారనుకుంటూనే.'

'ఆ పద్ధతులన్నీ మారిపోయాయండి.

'అయ్యో మారవుటండీ మరి. ఓల్డ్ ఆర్డర్ ఛేంజెత్-అంటూ వుంటాడు మా స్నేహితుడొకడు. అంచేత మారితీరవలసిందే. కాని చూడండి. ఈరాత్రికి రెండోఆట సినిమాకి పోయి కాలక్షేపం చేసేద్దామనుకుంటున్నాను. నాప్రాణం కంటె [illegible]వైన సర్టిఫికెట్లూ అవీ ఉన్న ఈపెట్టెని నేను వెళ్లిన చోటికల్లా ఎలా మోసుకుపోగలను చెప్పండి. దీని నొక్కదానినీ జాగ్రత్త చేశారంటే మీ మేలు మరిచిపోను, నాముందు ప్రయాణానికి చాలీచాలకుండా ఉంది డబ్బు.'

అతను వట్టి పిసినిగొట్టూ, గడుసువాడూ అని గ్రహించినా వరలక్ష్మి హృదయంలో ఆ మాటలవర్ణంవలన జాలిఏరు పొంగకుండా ఆగలేదు. 'మనగదిలో ఈమూల కావలసినంత చోటుంది నాన్నా! పెట్టుకోవచ్చని చెప్పరాదూ?' అంది.

తండ్రి వెంటనే ఆ సిఫారసుని తలదాల్చాడు. 'సరే పెట్టెకేం ఫరవాలేదనుకోండి. కాని మీరు సినిమాకి వెడితే తలుపు తీసేవారుండరు,' అన్నాడు.

ఆ అబ్బాయి పెట్టె ఎత్తుకొని వరలక్ష్మి కొంచెం తొలగగా గదిలో పెట్టుకుంటూ 'పోనీలెండి. మీకా శ్రమకూడా ఎలా యివ్వగలను? నేనీ అరుగుమీద చలిలోనే కునుకు పట్టించుకునేందుకు ప్రయత్నం చేస్తాను. ఈలోపున కాస్త తినడానికేమయినా తెచ్చుకునేందుకు అలా బజారికి వెళ్ళమంటారా?' అని వరలక్ష్మివైపు మరోసారి పరిశీలనగా చూశాడు.

'అందమైన కుర్రాళ్లు ప్రతీఆడపిల్లవైపూ చూసేందుకు తమకున్న అందం ఒక టిక్కెట్టు అనుకుంటారు కాబోలు!' అని వరలక్ష్మి కోపం తెచ్చుకుంది.

* * *

తండ్రీ కూతుళ్లూ తినిలేవగా, ఆ ఎంగిళ్ళు



ఎత్తి ఇక తాను అన్నం పెట్టుకుతిందా మనుకుంటోంది వరలక్ష్మి.

'అదేమిటండోయ్ ఆ కొత్త బన్నురొట్టెఅరటిపళ్ళతో తయారయారు? హోటుకూడ తెచ్చుకోలేక పోయారా' అంటున్నాడుఅరు గుమ్మిదపడుకున్న తండ్రి.

"కారమే! స్వీటు హోటులిద్దరిలో హోటునా నాలిక్కి స్వీట్ హార్ట్ కాలేక విడాకులిచ్చుకుని చాలాకాలమయిందండి" అని బదులిచ్చాడు ఇందాకటి అబ్బాయి.

'ప్చ్. బతుకంతా బాధలేనండి.'

'అవుననుకోండి. కాని జీవితం జనతావృద్ధాప్యంస్టేషన్ చేరేసరికి మన నెత్తిమీద మూటలూ అవీ దింపుకుని కొత్త హాయిగా కూర్చోడానికి వీలుంటుందని నా నమ్మకం.'

'చిన్నవాళ్ళుగనక మీకలాగ అనిపిస్తుంది. కాని ముసలితనంలోవుండే బాధలు ఇంకేదశలోనూ ఉండవు.'

'అలాగనకండి. సంసారతాపత్రయమనే ఆఫీసులో లెక్కలు ముక్కలు చేసుకుని వార్ధక్యంకొంప చేరుకుని పడకకుర్చీలో వాలగానే మనిషికి సగం శ్రమ పోతుంది. ఆ మీదభగవన్నామమనే టీని రుచి చూశాడా,ఓహోహో, దానిని తాగినకొద్దీ అతని అలసట మాయమయి ఆనందాన్ని పొందుతాడండీ.'

వరలక్ష్మి అన్నం పెట్టుకోవడం కూడామరిచిపోయి, నవ్వుకుంటూ నిలబడిపోయింది.

'ఏమిటండోయి, మీరు కవులా లేక వేదాంతులా?'

'లేక టీ ఏజెంటునా అనికూడా అడగవలసింది. మూడూ కానుగాని, మూడూ అయిన మాస్నేహితు డన్న మాట లివి.'

'బాగా సేవుంది. స్నానంచేస్తారా?'

'అయ్యో చెయ్యొద్దుటండీ! ఇవాళఎండా, దుమ్మూ అంతా సాహాలే గద.'

'సరే—అమ్మాయీ, చేద పట్రా' అనికేకవేశాడు పేరిశాస్త్రి.

మధ్యగదిలో చదువుకుంటూ వున్న లీలలేచి బొక్కెన తీసుకువచ్చింది.

'నువ్వెందుకే అక్కయ్యని తీసుకురమ్మన లేకపోయావ్?' అని విసుగుకున్నాడు తండ్రి.

'అక్కయ్య భోంచేస్తోంది నాన్నా'అంది లీల.

తండ్రి తనని చేదపట్టుకురమ్మనడంలో ఉద్దేశం వరలక్ష్మికి తెలుసు.

'లేదులేవే—నేను నుయ్యి చూపిస్తాను నాన్నా! రమ్మను'అంది.

ఆ అబ్బాయి హుషారుగా పెట్టెలోనితువ్వాళ్ళుతీసి వరలక్ష్మి దారి చూపగా శివాలయం నూతికి వెళ్ళాడు. నీళ్ళు తోడుకొనిగట్టుమీద పెట్టి పోసుకోక చుట్టూ చూడసాగాడు.

చంద్రోదయ మవుతోంది. ఆ మూల లతలనుంచి సువాసనలు వస్తున్నాయి.

ఇంకా అక్కడినుంచి కదలని వరలక్ష్మి'ఏమిటండీ, అలా నిలబడి పోయారు. నీళ్ళుపోసుగోండి' అని గుర్తుచేసింది.

[illegible] ఉన్న వరలక్ష్మి[illegible]

★ వరలక్ష్మికి వరుడు ★

'ఏమిటలా దిక్కులుచూస్తారు' అనడిగింది వరలక్ష్మి కోపంగా.

ఆ యువకుడు కొంటెగాచూసి నవ్వుతూ 'నా కంతా ఇంద్రజాలంలాగుందండీ. ఇక్కడ ఏది లతో, ఏది మీ శరీరమో, ఎవరు చంద్రుడో, ఏది మీ ముఖమో నాకేమీ అంతుపట్టడంలేదు. మా స్నేహితుడు సర్రియలిస్ట్ చిత్రాలు చూపించినపుడైనా ఇంత గాభరాపడలేదు' అన్నాడు.

వరలక్ష్మి కొంచెం ఆశ్చర్యపోయింది—అతను తీసుకున్న చనవుకి. 'పోకిరీరకమా?' అని అనుమానించబోయి 'ఈయన వాలకం చూస్తే అలాగ లేదే' అని జవాబు చెప్పుకుంది. అయినా ఏమంటాడో చూద్దామని 'మీరిప్పుడు వెళ్ళేది నేత్రవైద్యానికా?' అంది పెంకెగానే.

'అలాగే అనుకోవాలి. నిరుద్యోగుల కళ్ళకి పొరలాగఉన్న అమాయకత్వంవలన అర్హత ఉంటే ఉద్యోగం వస్తుందని నమ్ముతున్నారు. దానిని గవర్నమెంటు ప్రతీ ఇంటర్వ్యూకీ, రాత పరీక్షకీ వీరు వచినప్పుడల్లా కొద్దికొద్దిగా తొలగిస్తుంది. కనుక నేనొకవిధమైన నేత్రవైద్యానికే వెళ్తున్నాను.'

'సరే, నీళ్ళు పోసుకోదలచుకోలేదా?'

'చలి!'

వరలక్ష్మికి నవ్వువచ్చింది: 'సత్రవులో సుకుమారాలేవిటో! నీళ్ళు పోసుకునివచ్చి మానాన్నగారు మీకు పెళ్ళయిందా అని అడిగితే కాలేదని బొంకితే కాస్త వేడి వేడి చారూ, అన్నం అయినా దొరుకుతుంది' అంది.

ఈసారి ఆఅబ్బాయికి వొళ్ళు మండింది: 'బొంకడం! నాన్సెన్స్. నాకు నిజంగానే పెళ్ళికాలేదు.'

'అయినా కాకపోయినా కాలేదనే చెప్పాలి. ఇక్కడి రూల్సు అంతే' అని వెళ్ళిపోయింది.

*   *   *

పేరిశాస్త్రి తమయింట్లో అపూట భోంచెయ్యమనగానే మాధవరావు - అప్పుడే ఆ అబ్బాయి పూర్తిపేరు పేరిశాస్త్రి అడిగి తెలుసుకున్నాడు - సరే, మీలాంటి పెద్దలు పిలిచినపుడు కాదంటే అవిధేయతగా కనబడుతుంది' అని లేచాడు.

'మొగమాటపడకుండా తినండి. పచ్చడీ మెతుకులేగద? సత్రపు భోజనం అంటారే, ఇదే!' అతిథికి దగ్గరలో కూర్చుంటూ అన్నాడు పేరిశాస్త్రి.

'అయ్యో! ప్రేమకలుగుకూడు పట్టెడైనను చాలు అన్నాడు వేమన. అదీగాక నాకీ భోజనం అమృతోపమానంగా వుంది. పెసర పచ్చడిలో ఉల్లి చెక్కు వేస్తే ఇక నేను పరమాన్నమైనా అలా వేలేసి ముట్టను.'

'అంత యిష్టమన్నమాట. అన్నట్టు మన శాఖ ఏమిటిబాబూ?—ఇంకొంచెం నూనె వెయ్యి లక్ష్మీ. కారంగా వున్నట్టుంది,' అని కూతురివైపు చూశాడు పేరిశాస్త్రి. అలా అతను చూడ్డానికి కారణం పాపం మాధవరావు కారం తినలేక బాధపడుతున్నాడని కాదు. తను పెళ్లి ప్రసక్తి ఎత్తినందుకు కూతురు తర్వాత తనమీద కారాలూ మిరియాలూ నూరుతుందేమోననే భయం.

వరలక్ష్మి నూనె వేయబోయింది.

'అబ్బే అక్కరలేదండీ...ఆఁ...ఒక్కగరిటె చాలు. మనశాఖండీ, ఆఁ...' అంటూ గుర్తు చేసుకుంటున్నట్టు ఎడమచేతితో తల నిమురుకోసాగాడు మాధవరావు.

అతని బాధచూసి జాలిపడి వెల్లాట్లుకారు కామోసునాన్నా' అని నేర్పుగా అందించింది వరలక్ష్మి.

మాధవరావు తొడచరిచి 'ఆగుర్తువచ్చింది. కాకపోవడమేమిటి? వెల్లాట్లమే' అన్నాడు.

'ఇంకేం. ఈమధ్య మన శాఖీయులైన కుర్రాళ్లు నాకు తారసిల్లనేలేదు. మీకు మీగోత్రం తెలియదనుకుంటాను'

'తెలుసునండి కాని మరిచిపోయాను. ఈమరుపుబాధ పడలేకనే ఒప్లాను వేశాను. ఇన్‌ఫర్మేషన్ ఎండ్ ఇన్‌స్ట్రక్షన్స్ ఎట్సెటరా టుది ఫాదర్స్ ఆఫ్ అన్‌మేడ్ గర్ల్స్ ఎండ్ పెళ్లిళ్ల పేరయ్యాస్-అనే కరపత్రంలో నాకు సంబంధించిన వివరాలన్నీ వ్రాసి నన్ను పెళ్లి చేసుకోదలచిన ఆమె ఎలా ఉండాలో సూచనలుచేసి ముద్రించి కావలసినవారి కొక్కొక్క కాపీ యిద్దామనుకుంటున్నానండి' అని గడగడ మంచినీళ్లగ్లాసు కాళీ చేశాడు మాధవరావు.

'బాగానేఉంది. అయితే మీగోత్రం-'

'తెలుసునండి మీదాన్ని చెప్పండి. దాన్నిబట్టి ఏమైనా గుర్తొస్తుందేమో!'

'కాశ్యప-'

'అహఁ ఏదో భామీద వస్తుందండీ'

'భారద్వాజ-'

'ఆఁ! భారద్వాజస గోత్రం. ఈ అరవ ఋషుల పేర్లు ఉన్నాయే, చచ్చినా జ్ఞాపకం ఉండవనుకోండి.'

'ఛీఛీ! ఏమే లీలా! కుక్క వస్తూంటే చూస్తూ ఊరుకున్నావా? ఛీ!' అంటూ అవతలికి పరుగెత్తి పొట్టచెక్కలయేటట్లు నవ్వుకుంది వరలక్ష్మి.

పేరిశాస్త్రి మొగం కొంచెం విప్పారింది. అయితే మీరిప్పుడు వెళుతున్నది రాతపరీక్షకా? ఇందులో సెలక్టయితే ఎంత జీతం ఇస్తారు బాబూ?' అనడిగాడు.

'నూటముప్ఫయ్యండి'

'ఒహో-అమ్మాయీ! ఇలా వచ్చి చారులోకి మరికాస్త అన్నం వెయ్యవే,' అని కేకవేశాడు.

వరలక్ష్మివచ్చి అన్నం వడ్డించింది,

'అయ్యయ్యో ఇంకన్నం వద్దండీ... పడేశారూ?'

'అదేమాత్రం లెండి' అంటూ పేరిశాస్త్రి మాధవరావు ఆస్తిపాస్తుల వివరాలు అడుగుతూ మధ్య మధ్య కూతురి ముఖం చూడసాగాడు.



“గ్రామోత్సవానికి”

చిత్రకారుడు : కల్యాణప్రసాద్ శర్మ

భోజనం ముగించినతర్వాత అతిథితో పాటు అరుగుమీదకి వచ్చాడు పేరిశాస్త్రి.

వరలక్ష్మి గిన్నె చూసుకుంటే అట్టడుగున రెండు మెతుకులు మిగిలాయి. అవే ఊడ్చుకు పెట్టుకుని తన చెల్లెలికి మాధవరావిచ్చిన అరటిపళ్ళని లాగుకుని విస్తరిలో వేసుకుంది. ‘పాపం! ఎంత ఎంత ఆకలితో వచ్చాడో’ అనుకుంది తన కిక మిగిలేది ఆకలేకాబట్టి.

‘మీరు రెండో ఆటకి వెళ్ళొచ్చును. నేను తలుపుతీస్తాను,’ అన్నాడు పేరిశాస్త్రి.

‘అబ్బే అక్కరలేదండీ అరుగుమీద పడుకుంటాను అని వినయం కనబరచబోయాడు మాధవరావు.

‘నిద్ర పట్టదన్నారుగా?’

‘పట్టకపోతే నిద్రాదేవిమీద ఓ దండకం చదవడమే పని. భమిడిపాటి కామేశ్వరరావుగారనీ...’

‘ఏం, ఆయనకి పెళ్ళికావలసిన ఆడపిల్లలున్నారా ఏమిటి?”

‘నాకు తెలియదు. ఆ భమిడిపాటివారు దోమమీద ఓ దండకం చేశారు. అలాటిదే అయిన నా నిద్రాదండకం చదివినట్టయిందంటే సరి. ఎలాగంటే—’

‘మీలో చురుకుపాలెక్కువ. నాకు నిద్రాభంగం అవుతుందేమోనన్న శంకయంతో మీరు సినీమాకెళ్ళడం మానెయ్యకండి. షుగర్ కంప్లెయింటనీ—మీకెరుగుదురేమో?’ అని ఏదో చెప్పబోయాడు పేరిశాస్త్రి.

మాధవరావు వెంటనే ‘అయ్యో, షుగర్ కంప్లెయింటంటే ఎరగకపోవడం ఏమిటి? పంచదారకరువు గాదూ? పైగా మేం విజయనగరంలో ఉన్నప్పుడివన్నీ అనుభవించినవాళ్ళమే. రేషన్ కార్డుమీద ఇచ్చే పంచదార చాలక బ్లాక్‌లో నానాఅవస్థలూ పడి కొనేవాళ్ళం...’ అని ఏకరువుపెట్టసాగాడు.

పేరిశాస్త్రి విసుగుగా మధ్యలో అందుకుని ‘షుగర్ కంప్లెయింట్ అనేమాటకి పంచదార కరువనే అర్థం ఉందేమో మీలాటి చదువుకున్న వాళ్ళకి తెలియాలి. ఈ మాటని నాకు తెలిసినంతవరకూ ఓజబ్బుకి వాడతారు. తెలుగులో మధుమేహం అని కాబోలు అంటారు. దీనితో నేను చాలాకాలంగా బాధపడుతున్నందువల్ల నాకు రాత్రులు నిద్రపట్టదు, గనక “మీరు సినిమాకి వెళ్ళి వస్తే తలుపుతీస్తాను” అన్నాడు.

మాధవరావు సానుభూతి పూర్వకంగా ‘అయ్యో. అలాగటండీ, పాపం. ఏంచేస్తాం వార్ధక్యదశలో కూడా ఏవో బాధలు. సరే, మీరంతంగా చెప్తుంటే కాదనగలనా?’ అన్నాడు.

‘ఏసినీమాకి వెళతారు?’

‘నాలుగుబోర్డులూ చూసిగాని తేల్చుకోలేనండీ. తెలుగుసినీమాకయితే ఆ శ్రమ అనవసరం. దేనికి వెళ్ళినా ఒక్కటే.’

‘ముందరాగనీ, మొన్న మా పిల్లలు వెళ్ళొచ్చారు. దానికి—’ అని సూచించబోయాడు పేరిశాస్త్రి.

ఇంతలో వంటయింటిలోనుంచి వరలక్ష్మి ‘అదికాదు నాన్నా! అత్తా ఒకింటికోడలే అని రంగామహల్‌లో ఆడుతోంది. దానికి వెళమను. చాలా బాగుందట’ అని సలహా ఇచ్చింది.

ఆమెని బలపరుస్తూ ‘అలా చెయ్యండి’ అన్నాడు పేరిశాస్త్రి. ‘ఆఁ మీ ఎరికలో ఎక్కడైనా మంచిసంబంధాలున్నాయండీ?’ అనడిగాడు చల్లకివచ్చి ఇంకొంతసేపుంటాని దాచడమనుకుంటూ.

★ వరలక్ష్మికి వరుడు ★

మాధవరావు తెల్లబోయి 'ఎవరికి?' అన్నాడు.

'మా పెద్దమ్మాయికండీ. యింకెవరికి?'

'ఓహో,' అని సిగ్గుపడ్డాడు మాధవరావు. 'ఉన్నాయండీ కాని ఉన్నవాటిలో చాలా మందికి ఉద్యోగంలేదు. ఇంకొంతమంది తమ రక్తమాంసాలమ్ముకునే గాడిదలు!'

'అదేమిటి?'

'అబ్బే అలా భయపడకండి. అంటే కట్నాలడిగే బాపతన్నమాట.

'ఓ అదా చంపేశారు! కట్నం పుచ్చుకోనివాళ్ళెవరండీ?'

'ఎంతమాటన్నారు! ఆదర్శభావాలున్న యువకులు ముందుకు వస్తున్న యీరోజుల్లో అనవలసినమాటా అది? నేడు మన సమాజంలో అక్కడక్కడ ఒకొక్క యువకుడు—గంజాయిమొక్కలమధ్య తులసిలాగ, సానివీథిలో సంసారిలాగ, బ్రాందీ బుడ్లమధ్య బలవర్ధకఔషధంలాగ ఉండి, ఉద్యోగం సంపాదించకముందే పెళ్ళిచేసుకున్నవాడు గాడిదనీ, కట్నం పుచ్చుకున్నవాడు గాడిదతాతనీ కేకలు వేస్తున్నాడని మీకు తెలుసునా?'

ఈ ఉపన్యాసం విని పేరిశాస్త్రి హడిలిపోయాడు. 'అలాగాండి? కాని ఉద్యోగానికి ముందే పెళ్ళి చేసుకుంటే పోయిందేముందండి? కొద్దికట్నం పుచ్చుకుని దానిని ఏ ఆఫీసరుకో లంచంగా ఇచ్చేస్తే యిట్టే వుద్యోగం వచ్చేస్తుందిగదా?"

మాధవరావు చిరునవ్వునవ్వాడు. 'ఏమిటో అనుకున్నానుగాని మీరూ ప్రపంచజ్ఞానాన్ని తాగేసినవారే. కాని చూడండి. కట్నం పుచ్చుకోవడమే ఒక తప్పు అంటే, లంచం ఇవ్వడం ఆతప్పుని రెండుపెట్టి గుణించడమేగా?'

పేరిశాస్త్రి ఇంకేమో అడగబోతూవున్న సమయంలో తండ్రికి మంచినీళ్ళు పట్టుకు వచ్చిన వరలక్ష్మి 'నాన్నా, ఆయనకి సినీమాకి వేళవుతోంది. వెళ్ళనీ,' అంది.

పేరిశాస్త్రి అనిష్టంగానే 'అవును. మరి వెళ్ళిరండి' అన్నాడు.

* * *

సినీమానుంచి వచ్చాక పెట్టెతీసుకుని 'మరి వెళ్ళొస్తానండీ' అన్నాడు మాధవరావు.

'ఇదుగో బాబూ మాట' అన్నాడు పేరిశాస్త్రి కొంచెం జంకుతూ. 'ఇందాక మా పిల్ల భయంవలన అడగలేకపోయాను. ఆఁ. మీకు పెళ్ళయిందా?'

వరలక్ష్మికి తెలివి వచ్చింది.

'అయ్యో, పెళ్ళి కాకపోవడమేమిటండీ. మొన్ననే మా అబ్బాయికి—'

'ఆఁ!'

'—బారసాలకూడా అయింది.'

పేరిశాస్త్రి దీర్ఘనిశ్వాసం విడిచాడు. 'ఉద్యోగం దొరకనిదే పెళ్ళి చేసుకోకూడదన్నారే' అన్నాడు.

'అవును. ఇప్పుడూ అంటాను. ఉద్యోగం లేనివాడు ఏదో రోమాన్సుకోసం ఆశపడి పెళ్ళాడితే ఎన్ని బాధలు ఉన్నాయో స్వానుభవంవలన గ్రహించి అన్నమాట అది! రైలు వేళవుతోంది. వెళ్ళొస్తానండీ మరి.'

'మంచిది.'

దూరమవుతున్న మాధవరావు అడుగుల చప్పుడు వింటూ కొయ్యబొమ్మలాగ నిలబడివున్న తండ్రిమొగం చూసింది వరలక్ష్మి. 'అయ్యో, కొండంతఆశ పెట్టుకున్న నాన్న మనస్సుకి ఎంత దెబ్బతగిలింది. ఆడపిల్లల తండ్రులంటే పెళ్ళికొడుకుల కెంత చులకన! పిల్లికి చెలగాటం, ఎలకకి ప్రాణసంకటం' అనుకుంటూ ఇంకొకపక్కకి ఒత్తిగిలింది ఆమె—దణ్ణెంమీద మాధవరావు ఆరవేసిన తువ్వాళ్ళు కనిపించాయి. 'అరె, వెళ్ళేటప్పుడు లేచి ఆయనకి వాటిమాట జ్ఞాపకం చేద్దామనుకుంటూనే పడుకున్నాను సుమా. నాన్న గొడవలో పడి మరిచిపోయాను. మరి మతిలేనిదాన్ని' అని బాధపడింది వరలక్ష్మి.

* * *

మాధవరావు వెళ్ళిపోయినతర్వాత పేరిశాస్త్రి మారిపోయాడు పూర్తిగా. మునుపటిలాగ అతను యువకులని పలకరించి వారి కులగోత్రాలు అడగడం మానుకున్నాడు. కొంచెం పరాకుకూడా ఎక్కువయింది.

తండ్రిలో వచ్చిన యీమార్పుకి వరలక్ష్మి మొదట్లో సంతోషించినప్పటికీ, రెండు మూడురోజులలోనే ఆమెకి తండ్రిఅంటే అంతులేనిజాలి పుట్టుకొచ్చింది. మాధవరావు మీద ఆఅమ్మాయికి ఎంత కోపంగావున్నా అతను వచ్చివెళ్ళడంతో ఆమె మనస్సులో ఏదో వెలితి ఏర్పడింది. అతని గురించి ఆలోచించడం వరలక్ష్మికి ఇష్టంలేదు. కాని అతను తలపుకి రాకమానడు. తొలిరోజులలో అతనినిగూర్చిన తలపులు ఆమెకి తియ్యగా తోచేవి. ఆ తలపులు అతని చక్కదనమూ, మాటకారితనమూ గురించే కాబట్టి. కాని ఆలోచించినకొద్దీ మాధవరావులోని అవగుణాలన్నీ ఒకొక్కటే క్రమంగా కలతపెట్టసాగాయి వరలక్ష్మిని. తాను అందగాడినన్న అహంభావం మాధవరావుకి ఎక్కువ. ఈ విషయం అతను తనవైపు చూసినప్పుడల్లా అతనికళ్ళలో కొట్టవచ్చినట్టు కనబడేది వరలక్ష్మికి. అతను వసపోసినపిట్టలాగ వాగడానికి కారణం అతను పరమకుంఅవడమేనని వరలక్ష్మి నమ్మకం. ఈరకం 'మాటకారుల' సంభాషణలు మూడుసార్లు వింటే మొహం మొత్తుతుంది. కొత్తదనం వున్న. ఇందుకు వరలక్ష్మి ఏమీ అనుకోదు పెద్దగా. కాని మాధవరావు కపటి అన్న తలపు ఆమె హృదయంలో ముల్లులాగ ఉంది. ఒకరూపాయి డబ్బులు నావికావనుకుంటే లభించే భోజనవసతి సౌకర్యం కోసం కుక్కలాగ అన్నిపాట్లుపడి, పైపెచ్చు దానికి ఉన్నపాటి విశ్వాసమయినా లేక నానా అబద్ధాలూ కల్పించిచెప్పి చివరకితన తండ్రి ఆశలని నరికి జారుకున్న ఆ కసాయివాడంటే వరలక్ష్మి ఒకమూల కోపం, ఇంకోమూల దుఃఖం.

(46-వ పేజీ చూడండి)

పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదిలగాయితు 12మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము. ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మూసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

వరలక్ష్మికి వరుడు ★

(36-వ పేజీ తరువాయి)

'మాధవరావు మరోసారి ఇక్కడికి వస్తే బాగుండును' అని ఆశతో ఎదురు తెన్నులు చూస్తుంది ఒకసారి వరలక్ష్మి. 'వస్తే మొగం మీద పేడనీళ్ళు జల్లాలి,' అని కోపగించుకుంటుంది మరోసారి ఆ వరలక్ష్మే.

ఇలాగ ఒక నెలరోజులు గడిచిపోయాయి. ఆరోజు పూర్ణిమ. గతనెల మాధవరావు వచ్చినరోజు. అదంతా వరలక్ష్మికి జ్ఞాపకం రాసాగింది. రాత్రి పన్నెండయినా, నిండు చంద్రుడు నడినెత్తిమీదికి వచ్చినా వరలక్ష్మికి కునుకుపట్టలేదు. కొంతసేపు పక్కమీదనే దొర్లిదొర్లి చివరకి చికాకు కలగగా లేచి వెళ్ళి కిటికీలో కూర్చుంది.

రోడ్డుకి అవతల ఉన్న కదలని చెరువు మీది వెన్నెల టేబుల్ మీద పరచిన గాజు పలకలాగ ఉంది. అవతలి ఒడ్డున ఇంకా దీపాలు వెలుగుతున్న మేడ చెరువులో తన ప్రతిబింబం చూసుకుంటోంది సగర్వంగా, దానిపక్కనే నల్లగా ఒక తురాయిచెట్టు ఉంది. దానివల్లే ఆ తెల్లని మేడ మరింత బాగా ప్రకాశిస్తోందని చెప్పవచ్చు. ఒక తెలి మబ్బు పైకి లేస్తూవుండగా, శివాలయంలోని బాదంచెట్టు మేలిముసుగు లాగుకుంటోందేమో అనిపిస్తుంది. ఈ సౌందర్యమంతా నిశ్శబ్దపు కౌగిలిలో ఒదిగి నిద్రిస్తున్నట్టు ఉంది.

వీధితలుపు చప్పుడయింది.

ఉలికిపడింది వరలక్ష్మి.

'పంతులుగారూ, తలుపు!' అని పిలుపు.

మాధవరావు గొంతు అది. గుర్తుపట్టింది వరలక్ష్మి. ఆశ్చర్యపోయింది. ఆ ఆశ్చర్యంలో ఆశ ఉంది. ఆనంద ముంది. ఆందోళన ఉంది. మాధవరావు ఎక్కడినుంచి వచ్చినట్టు? ఎందుకు వచ్చినట్టు?

'తలుపు తియ్యండి పంతులుగారూ, తలుపు.'

తండ్రిని లేపుదామని లేచింది వరలక్ష్మి. అంతవరకూ నిద్రరాక అవస్థపడి అప్పుడే కన్నుమూసిన తండ్రి మొగం కిటికీగుండా పడుతున్న వెన్నెలలో ప్రశాంతంగా ఉన్నట్టు కనిపించింది ఆమెకి. ముఖం అనేది గాజుతలుపు వెనుకఉన్న రకరకాల వస్తుసముదాయంలాటిది మనస్సు. ఆ రెండింటికీ మధ్య నిద్ర అనే తెల్లని తెర దిగినపుడు గాజుతలుపు ఎంతో స్వచ్ఛంగా తేటగా కనిపించడం సహజమేగదా? తండ్రిని లేపడానికి వరలక్ష్మి మనసు ఒప్పలేదు. పోనీ చెల్లెలిని తోడుగా తీసుకువెళ్దామా అంటే ఆ పసిపిల్లని గాఢనిద్రనుంచి లేపడం బ్రహ్మతరంకాదు.

అయినా మాధవరావు ఏం పెద్దపులి కాడు గదా.

వరలక్ష్మి మెల్లిగా వెళ్ళి తలుపు తెరచింది.

'ఒహో, మీరే వచ్చారా? అనుకుంటూనే ఉన్నా. మీ నాన్నగారు మేలుకుని లేరుగదూ? తువ్వాళ్లు మరచిపోయానుగా. వాటిని తీసుకుపోవడానికి, ఇంటికి తిరిగి వెళ్తూ, ఇక్కడ దిగాను,' అంటూ లోనికి వచ్చాడు మాధవరావు.

వరలక్ష్మికి అసహ్యం వేసింది. 'ఆ దణ్ణెం మీద అలాగే ఏడుస్తున్నాయి. పట్టుకు దయచెయ్యండి' అంది.

మాధవరావు నవ్వుతూ 'అది సరే; గాని నా మనస్సునికూడా ఇక్కడే మరచిపోయాను. నా హృదయాన్ని తీసుకున్న మిమ్మల్ని కూడా పట్టుకు దయచెయ్యమంటారా?' అనడిగాడు.

అర్ధరాత్రప్పుడు ఒంటరి ఆడపిల్లతో ఆ మాటలనగలిగిన ఆ వింతమనిషిని చూసి వరలక్ష్మి ఆశ్చర్యపోయింది. అయినా ధైర్యంగా నే 'నా మీద మోజుపడిన ప్రతీవాళ్లూ నన్ను పట్టుకుపోవడానికి నే నేమీ షాపులోని రబ్బరుబొమ్మని గాను' అని జవాబిచ్చింది.

'నేను మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను.'

'నేను మిమ్మల్ని చేసుగోను.'

అరుగుమీద చతికిలబడుతూ 'నా ఉత్తరం మీకు అందలేదా? మన తపాలాశాఖ సామర్థ్యం సాటిలేనిది, జగద్విఖ్యాతం లెండి.—అయితే ఇన్ని ఎకరాలనీ కాలదన్నే మీరు శుద్ధతెలివితక్కువవారో, మహా తెలివైనవారో అయుండాలి.' అన్నాడు మాధవరావు.

'మీదయవల్ల నాలో రాయలసీమా లేగు, చిరపుంజీ లేదు లెండి. ఆడవాళ్లకి డబ్బంటే ప్రాణం అని ఒప్పుగుంటానుకోండి. కాని అందరూ డబ్బుచేతే పుస్తె కట్టించుకుంటారనుకుంటే పొరపాటుపడ్డారన్నమాటే' అంది వరలక్ష్మి స్తంభాన్ని ఆనుకుని.

'అరె! కథ అడ్డంతిరిగిందే. మా స్నేహితుడు అంటూనే ఉంటాడు—క్షణక్షణములు మృగాక్షుల చిత్తముల్ - అని కాబోలు. లేకపోతే ఆవేళ నామీద అన్నివిధాల జాలిపడి నాతో సహకరించిన మీరేనా ఇవ్వాళ ఇలా అంటున్నది?' అని ఎంతో జాలిగొలిపేలాగ మొగంపెట్టాడు మాధవరావు.

'జాలి గుండెదాన్నిగదా అని మెత్తని కబుర్లు చెప్పి మోసగించకండి—' అని ఏమో అనబోయింది వరలక్ష్మి.

మాధవరావు తటాలున లేచాడు, ఆశ్చర్యపోతూ. 'మోసగించడమా? అదా నాగురించి మీ అభిప్రాయం?! సరే, సెలవు.' అని వెళ్లబోయాడు.

వరలక్ష్మి ఎందుకో భయపడింది: 'ఇదుగో గాని, అంత తొందరేం?... ఆఁ. ... మీ తువ్వాళ్లు తీసుకోరూ?' అంది బతిమాలుతున్నట్టు.

'అక్కరలేదు.' అని వెళ్లిపోసాగాడు.

వరలక్ష్మి కళ్లు నిండసాగాయి. 'మాట! ఇప్పుడేం రైలు లేనట్టుంది. ఎక్కడికి పోతా రీ రాత్రి?'

'నీ ఆదర్శవరు డున్న అవతలి గట్టుకి వస్తూ. అక్కడినుంచి కేకవేసినప్పుడైనా నా దగ్గరికి వస్తావుగదూ?' అంటూ వెళ్లిపోయాడు మాధవరావు.

అతనిని పిలుద్దామన్నా గొంతు పెగల లేదు వరలక్ష్మికి.

తన యీ ప్రేమ మాధవరావు అలా వెళ్లిపోవడంతో విషాదాంతచలనచిత్రంలోని ఆఖరి రీలుగా అయిందో, లేక సుఖాంత చలనచిత్రంలోని ఇంటర్వల్‌గా ఉందో మాత్రం ఆ అమాయకురాలు వరలక్ష్మికి అప్పట్లో తెలియదు. ★

తెల్ల వెంట్రుక లుండవు

తంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేదపద్ధతిలో తయారైనది. 50 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇది గాక మెదడుకు చల్లదనమునిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5; 3 సీసాలు రు. 12. సగము నెరసివుంటే ఒకసీసా రు. 6; 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/-లు పనిచేయకపోతే డబ్బు వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

INDRA AYURVED BHAVAN,
(A. P.) P.O. Rajdhanwar (H Bagb).

★డిస్మెంసాల్
కుసుమ, బహిష్టునొప్పులకు
అద్భుతముగాపనిచేయును
వివరములకు — AGENTS
R.K.BROTHERS
4/27. RAJAHMUNDRY.